క్లుప్తంగా

ఇద్దరు విద్యార్థులే హాజరు!



ఇద్దరు విద్యార్థులకు పాఠం చెబుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చిన్న యగుంట గ్రామ ఫౌండేషన్ పాఠశాలకు శుక్రవారం ఇద్దరు విద్యార్థులే వచ్చారు. మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం పాఠశాల తనిఖీకి వెళ్లి, ఉపాధ్యాయుడితో కలసి ఆ ఇద్దరి నోట్ బుక్స్‌ను పరిశీలించి పాఠం చెప్పారు. పాఠశాలలో ఒకటి, రెండు తరగతులకు కలిపి ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉండగా ఒకరు రాలేదు.

రోగులతో ఆస్పత్రి కిటకిట



ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యానికి వచ్చిన రోగులు

నాగలాపురం: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణం మార్పులకు సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరం, జలుబు, దగ్గు సమస్యలతో వైద్యం కోసం వస్తున్న రోగులతో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం రోగులతో కిటకిటలాడింది. మరోవైపు ఆస్పత్రిలో సిబ్బంది కొరతగా మూలాన రోగులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందివ్వలేని పరిస్థితి నెలకొంది.

జెండర్ రిసోర్స్ కేంద్రం ప్రారంభం



రిసోర్స్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభావతి

నారాయణవనం: దౌర్జన్యాలకు, గెంటివేతకు గురయ్యే మహిళల కోసం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఏర్పాటు జెండర్ రిసోర్స్ సెంటర్‌ను శుక్రవారం సెర్ప్ ఏపీడీ ప్రభావతి ప్రారంభించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ, మహిళల సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రాన్ని ప్రారంభించామని, అన్ని వసతులతో భవన్ ఉందని, ఇబ్బందులకు గురైన మహిళలు ప్రతి గురువారం ఇక్కడ నిర్వహించే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. కేంద్రంలోని రిసోర్స్ పర్సన్లు బాధితులకు అండగా నిలుస్తారన్నారు. స్త్రీ సమానత్వం కోసం ప్రతి మహిళ మరొకరికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం ధనుంజయరెడ్డి, సీసీలు, కేంద్రం సీఆర్పీలు, మండల సమైక్య సభ్యులు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు



నందీశ్వరునికి పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రదోష పూజలకు భక్తులు పోటెత్తారు. ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని నందీశ్వరస్వామి, శ్రీ వాల్మీకీశ్వరస్వామికి ఏక కాలంలో పూజలు చేశారు. ఈ పూజలకు నింద్రకు చెందిన శ్రీనివాస మిల్క్ డైరీ ఎండీ వాసుదేవనాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లత, ఆలయ సిబ్బంది పరంధామరెడ్డి, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెరటి కోళ్ల పంపిణీ

రేణిగుంట: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం డ్వాక్రా మహిళలకు 100 యూనిట్ల పెరటి కోళ్లను ఏపీఎం కోమలా దేవి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆమె కోరారు.

హోరాహోరీగా మండల క్రీడా పోటీలు




హైస్కూల్ క్రీడా మైదానంలో సాగుతున్న వాలీబాల్ పోటీలు, మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ సరస్వతి

వరదయ్యపాళెం: స్థానిక జెడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో మండలస్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా జరిగాయి. శుక్రవారం ఈ పోటీలను ఎంఈఓ సరస్వతి లాంఛనంగా ప్రారంభించారు. బాల బాలికల విభాగంలో వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహించారు. మండలంలోని ఆరు ప్రభుత్వ, జెడ్పీ, 3 ప్రైవేటు హైస్కూళ్ల విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీలలో తలపడ్డారు. సాయంత్రం విజేతల వివరాలను పీడీ బందిల కుమార్ వెల్లడించారు.

కబడ్డీలో..
సీనియర్ బాలుర వాలీబాల్ విభాగంలో బత్తలవల్లం, వరదయ్యపాళెం, జూనియర్ బాలుర విభాగంలో సంతవేలూరు బత్తలవల్లం, సీనియర్ బాలికల విభాగంలో బత్తలవల్లం, కారిపాకం, జూనియర్ బాలికల విభాగంలో బత్తలవల్లం, వరదయ్యపాళెం హైస్కూళ్ల జట్లు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి.

ఖో–ఖో విభాగం
సీనియర్ బాలుర విభాగంలో గోవర్ధనపురం, వరదయ్యపాళెం, జూనియర్స్ విభాగంలో వరదయ్యపాళెం, కారిపాకం, సీనియర్ బాలికల విభాగంలో గోవర్ధనపురం, వరదయ్యపాళెం, జూనియర్ బాలికల విభాగంలో గోవర్ధనపురం, వరదయ్యపాళెం విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి.

కబడ్డీ విభాగం
సీనియర్ బాలుర విభాగంలో వరదయ్యపాళెం, నైస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, జూనియర్స్ విభాగంలో గోవర్ధనపురం, సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, సీనియర్ బాలికల విభాగంలో పాండూరు, గోవర్ధనపురం, జూనియర్ బాలికల విభాగంలో బత్తలవల్లం, వరదయ్యపాళెం విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి.

చెస్ విభాగం
సీనియర్ బాలుర విభాగంలో నైస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి తారక్ సాయి, జూనియర్స్ విభాగంలో వరదయ్యపాళెం హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు ధనుష్, జ్ఞానేశ్వర్, జూనియర్ బాలికల విభాగంలో గోవర్ధనపురం హైస్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థిని సాయి ప్రణతి విజేతలుగా నిలిచారు.

యోగా విభాగం



యోగా పోటీల్లో ఆసనాలు వేస్తున్న విద్యార్థిని

సీనియర్ బాలుర విభాగంలో సీహెచ్ ప్రణీత్ (బత్తలవల్లం), జూనియర్స్ విభాగంలో బత్తయ్య(పాండూరు), జూనియర్ బాలికల విభాగంలో అలేఖ్య(బత్తలవల్లం), మునీశ్వరి (పాండూరు) విజేతలుగా నిలిచారు.కార్యక్రమంలో హెచ్‌ఎం రమణయ్య, మొహిద్దీన్, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం పదిలం



కబడ్డీ ఆడుతున్న బాలికలు

నారాయణవనం: బాల్యం నుంచే క్రీడలను దినచర్యలో ఒక భాగం చేసుకుంటే ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని పాలమంగళం హెచ్‌ఎం శివాజీగణేశన్ అన్నారు. శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ పాలమంగళం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో, యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ అంశాలలో అండర్–14, అండర్–17 కేటగిరీలలో ఈ పోటీలు బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైన వారిని డివిజన్ స్థాయి పోటీలకు పంపుతామని మండల కో–ఆర్డినేటర్ రాజా తెలిపారు. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు సదాశివం, శివకుమార్, హరి, వెంకటేష్, జయప్రద, రుక్మిణి నిర్వహించారు.

మహిళలకు మెరుగైన వైద్య పరీక్షలు




అవగాహన కల్పిస్తున్న విజయ్ కుమార్, తూకివాకంలో వైద్యం అందిస్తున్న చక్రపాణి రెడ్డి

నాగలాపురం: మండలంలోని ఎస్‌ఎస్.పురంలో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి విజయ్ కుమార్..షుగర్, రక్తపోటు, రక్తహీనత, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసి మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం గురించి మహిళలకు వివరించారు. మహిళలకు పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి షీబా, గాయత్రి, మేఘల, జాన్సీ, ఏఎన్‌ఎంలు జయమ్మ, చంద్ర, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రేణిగుంట: మహిళలకు మెరుగైన వైద్య సేవలు, ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా స్వస్థ నారీ స శక్త్ పరివార అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి చక్రపాణి రెడ్డి అన్నారు. స్వస్థ నారీ స శక్త్ పరివార అభియాన్ కార్యక్రమంలో భాగంగా రేణిగుంట మండలం తూకివాకం, కష్టాపురం పంచాయతీల్లో వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య అధికారి చక్రపాణి రెడ్డి, తారక రామా నగర్ వైద్యాధికారి జుబేర్ స్థానికులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి వైద్యం అందించారు. కార్యక్రమంలో సీడీపీఓ కష్ణవేణి, సూపర్‌వైజర్లు కామరాజు, నాగరాజు, సుమ శ్రీ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలంటే గౌరవం లేనివారికి చైర్మన్ పదవా?

శ్రీకాళహస్తి: మహిళలంటే గౌరవం లేని వ్యక్తికి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ పదవి ఇవ్వడం సబబు కాదని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కోట వినుత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై జరిగిన రాజకీయ కుట్రలో ప్రధానమైన వ్యక్తుల్లో ఈ కొట్టే సాయిప్రసాద్ ఒకరని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలన్నీ జనసేన కార్యాలయంలో ముఖ్యమైన నాయకులకు పంపించనట్లు తెలిపారు. ఎంతో మంది జనసైనికులు కష్టపడి పనిచేశారని వారికి గొప్ప అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు.

అన్నమాచార్యలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

రేణిగుంట: మండలంలోని కరకంబాడి – తిరుపతి రహదారిలో ఉన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు ఇన్నోవేషన్ సెల్ ద్వారా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ – 2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ప్రిన్సిపల్ నాదముని రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 25న కళాశాలలో విద్యా మంత్రిత్వ శాఖ నిర్దేశించిన విధంగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025 కోసం కళాశాల విస్తత ప్రచారం కల్పిస్తూ ఉందని తెలిపారు. విద్యార్థులు 75 బృందాలుగా ఎస్ ఐ హెచ్ సూచించిన థీమ్లపై తమ ఆలోచనలను అందిస్తున్నారని అన్నారు.

ఆరులేన్ల ప్రతిపాదన విరమించుకోవాలి



నిరసన తెలుపుతున్న స్థానికులు

శ్రీకాళహస్తి: చెన్నై–నాయుడుపేట రోడ్లను కలపుతూ ఆరులేన్ల రోడ్డు నిర్మాణ ప్రతిపాదను విరమించుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఊరు లోపల ఆరులైన్ల రోడ్డు వద్దు, ఊరి బయట ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఏవో శాంతికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో చెన్నై, నాయుడుపేటను కలుపుత తొట్టంబేడు మండలం బసవయ్యపాలెం వద్ద నాలుగులేన్ల రోడ్డు వేశారన్నారు. అందులో కొన్ని పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. ఇపుడు నాలుగు లేన్ల రోడ్డును ఆరులేన్ల రోడ్డుగా మార్చడం వలన తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: కేంద్ర, ఉపాధి శాఖ కింద పనిచేస్తున్న బీడీ కార్మికుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు సంబంధించి 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాళహస్తి బీడీ కార్మికుల వైద్యాధికారి వెంకట భాస్కర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అక్టోబరు 30వ తేదీ వరకు గడువు పెంచినట్లు తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో విద్యార్థులు, అతిథులు

ఏర్పేడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అండర్– 14, 17 మండల స్థాయి క్రీడా పోటీలు ఏర్పేడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఏర్పేడు సర్పంచ్ నల్లపాళెం శివయ్య ఈ క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 దయాకర్‌రావు, ఏర్పేడు బీసీ వసతి గృహ సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు, ఏర్పేడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మునిలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చండి

శ్రీకాళహస్తి: యూరియా కొరత తీర్చి రైతులను ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు డిమాండ్ చేశారు. కిసాన్ కాంగ్రెస్ పార్టీ, డీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగం రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. బాలగురవం బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కృత్రిమ కొరతతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి



డీఎస్పీ శ్రీనివాసులు

వరదయ్యపాళెం: అంతర్జాతీయంగా శ్రీసిటీకి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా భద్రతా పరంగా ప్రత్యేక నిఘా ఉంచుతామని డీఎస్పీ బీవీ శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం ఉదయం ఆయన శ్రీసిటీ డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ, వేలాది మంది ఉద్యోగ, కార్మికులు పనిచేస్తున్న ఈ ప్రాంతంలో ప్రధానంగా శాంతి భద్రతలకు పెద్దపీట వేస్తామన్నారు.. అలాగే రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. తొలుత ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా సత్కరించి అభినందించారు.

ముక్కంటి సేవలో తెలంగాణ కోర్టు అధికారి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం తెలంగాణ స్మాల్ కేసెస్ కోర్టు చీఫ్ మినిస్టీరియల్ అధికారి పీవీపీ అంజనీకుమారి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితుల ఆశీర్వచనం అందించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఊంజల్ సేవలో పద్మావతీ అమ్మవారు



ఉయ్యాల సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఉయ్యాల సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుప్రభాత సేవతో తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను చేశారు. ఉదయం 7 గంటలకు వేంకటేశ్వర స్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేసారు. సాయంత్రం నిత్యకైంకర్యాల అనంతరం తిరుచ్చి వాహనంపై అమ్మవారు ఊరేగిన అనంతరం ఉయ్యాలసేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు శ్రీనివాస భట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భూపరిహారం చెల్లింపు కోసం రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు గ్రామంలో ఏపీఐఐసీ భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పరిహారానికి సంబంధించి శుక్రవారం తహసీల్దారు శ్రీదేవి గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఇక్కడ ఏపీఐఐసీ కోసం రైతుల నుంచి భూములు సేకరించామని, ఇప్పటికే కొందరికి పరిహారం చెల్లించామన్నారు. పట్టాదారు పాసు పుస్తకాల రికార్డులు సక్రమంగా లేకపోవడం, భూవివాదాలు తదితర కారణాల వలన 80 మంది రైతులకు పరిహారం పెండింగ్‌లో ఉందన్నారు. గ్రామసభలో వీరిని విచారణ చేసి, రికార్డులను పరిశీలించి, త్వరలోనే నష్టపరిహారాన్ని ఇస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలుపై అసెంబ్లీలో చర్చించాలి



ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: విద్యార్థులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై అసెంబ్లీలో చర్చించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిల ముని చందు, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అభి, శివ అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం చర్చించాలని లేని పక్షంలో సీఎం కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ముఖేష్, చైతు, సల్మాన్, షాహిద్, హనీ, చరణ్ తదితరులు పాల్గొన్నారు

పేస్కేల్ అమలు చేయాలని ధర్నా



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

వరదయ్యపాళెం: వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేసి రూ. 21వేల జీతం ఇవ్వాలని మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు శ్రీహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. రాష్ట్ర వీఆర్‌ఏల కార్యవర్గం పిలుపు మేరకు అపరిష్కృత సమస్యల పరిష్కారానికి శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ప్లకార్డులతో నిరసన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ, నామినీ వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. తమ డిమాండ్లను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని లేని పక్షంలో దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం ఉపాధ్యక్షులు రామ్మూర్తి, కార్యదర్శి రాధయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల నిరసన




శ్రీకాళహస్తి: నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు, రేణిగుంట: మూసిఉన్న డాక్యుమెంట్ రైటర్ షాపు

శ్రీకాళహస్తి/రేణిగుంట: దస్తావేజుల తయారీలో ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని, చెక్ స్లిప్ ఎడిట్ ఆప్షన్ పునరుద్ధరించి ప్రజలు సమస్యలు తొలగించాలని కోరుతూ శుక్రవారం శ్రీకాళహస్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సహాయకులు నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు చేపట్టనున్న పెన్ డౌన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీకాళహస్తిలో నిరసన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు చేపట్టిన రెండు రోజుల పెన్ డౌన్ నిరసన కార్యక్రమంలో భాగంగా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని డాక్యుమెంట్ రైటర్లు వారి కార్యాలయాలను శుక్రవారం మూసివేసి నిరసన తెలిపారు.

చిన్న పరిశ్రమల స్థాపనపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖ అధికారి

రేణిగుంట: పట్టణంలోని మండల సమాఖ్య భవనంలో శుక్రవారం రేణిగుంట, ఏర్పేడు మండలాల సంఘం మహిళలతో జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. స్కిల్ డెవలప్మెంట్ మేనేజర్ లోకనాథం, జిల్లా పరిశ్రమ శాఖ అధికారి మురళి చిన్న,సూక్ష్మ పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించారు. ప్రభుత్వాలు అందించే తోడ్పాటును ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు అనిల్ కుమార్,హరికష్ణ,వాసు,సూరి, కోమలాదేవి, సీసీలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకారం

శ్రీసిటీ (సత్యవేడు) : విద్యారంగ అభివృద్ధికి సహకరిస్తూ.. సామాజిక బాధ్యతకు కట్టుబడి ఉన్నామని రాక్‌వర్త్ పరిశ్రమ సీఈఓ శైలేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆఫీస్ ఫర్నిచర్ తయారీ అగ్రగామీ సంస్థ రాక్‌వర్త్ సిస్టమ్ ఫర్నీచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ గురువారం శ్రీ సిటీలోని తమ పరిశ్రమ 14వ వార్షికోత్సవాన్ని వేడుకగా జరుపుకుంది. ఈ వేడుకలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శైలేష్ కుమార్, తన తల్లి జ్ఞాపకార్థం మీనాదేవి మెమోరియల్ ట్రస్టు పేరిట రాక్‌వర్త్ ఉద్యోగుల పిల్లలు 40 మందికి , పరిసరాలకు చెందిన ఇతర పిల్లలు మరో 25 మందికి కలిపి రూ. 30 లక్షలు విద్యార్థుల ఫీజులు చెల్లించారు.



ఫీజు రసీదులను చూపుతున్న విద్యార్థులు